క్లుప్తంగా

పోస్టుల భర్తీకి వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో ఖాళీగా ఉన్న మిడ్ డే మీల్స్, మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్ సాగర్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌హసన్, సాగర్, రాష్ట్ర కార్యదర్శి జీఎస్ ప్రసాదరావులు మాట్లాడుతూ మిడ్ డే మీల్స్, స్కూల్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదులు, ఎరుమళ్ల శ్రీనివాసరావు, సత్యం, జిల్లా విద్యాశాఖ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు యూసుఫ్ అహ్మద్, నగేష్, నాయకులు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఈఓకు..

జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మను కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రవి, కృష్ణ, గోపి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ

నేలకొండపల్లి: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ స్థాయిలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్‌లో నేలకొండపల్లికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు. విజయవాడ ఇండోర్ స్టేడియం లో జరిగిన పోటీలలో కొత్తా క్రాంతికిరణ్, నాళ్ల సాయి సురేష్‌లు అత్యంత ప్రతిభ చూపారు. అంతర్జాతీయ స్థాయిలో మూడో స్థానం దక్కించుకున్నారు. వీరిని క్లబ్ ప్రతినిధులు రేగూరి హనుమంతరావు, ఎంపీటీసీ రేగూరి వాసవి తదితరులు అభినందించారు.

2న బంజారాభవన్‌లో సమావేశం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని బంజారా భవన్‌లో జూన్ 2న అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ బష్కీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బంజారా ముద్దుబిడ్డ భాణునాయక్ విగ్రహాన్ని జూన్ 17న లకారం ట్యాంక్‌బండ్‌పై ఆవిష్కరించనున్న నేపథ్యాన ఏర్పాట్లపై చర్చించే సమావేశానికి అందరూ హాజరుకావాలని కోరారు.

'కంటివెలుగు' చారిత్రాత్మకం

ఖమ్మంరూరల్: కంటివెలుగు చారిత్రాత్మక కార్యక్రమమని ఎంపీపీ బెల్లం ఉమ అన్నారు. మంగళవారం మండలంలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన కంటివెలుగును ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, సర్పంచ్ సుభద్ర, ఏ.వెంకన్న, వెంకటేశ్వర్లు, సాయి, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసేందుకు కుట్ర

కూసుమంచి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తోందని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు విమర్శించారు. మంగళవారం కూసుమంచిలో నిర్వహించిన సంఘం పాలేరు నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం పేదలను, కార్మికులను విస్మరిస్తుందన్నారు. అనంతరం ఉపాధిహామీ సమస్యలపై ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎర్ర శ్రీనివాస్‌రావు, మండలాధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి మూడ్ గన్యానాయక్, నాయకులు కేవీరెడ్డి, నాగేశ్వరరావు, నర్సయ్య, గురుమూర్తి, కర్ణబాబు పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడిన గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన హరి వీరస్వామి రోజు మాదిరిగానే మంగళవారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ఈక్రమంలో కాలు జారి కింద పడిన ఆయనకు తీవ్ర గాయాలు ఖమ్మం తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	2018
సాయిరాం	మళ్లీ పెళ్లి
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మం గాంధీచౌక్

సప్లిమెంటరీకి సన్నద్ధం

ఇంటర్‌లో ఫెయిలయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఆన్‌లైన్‌లోనూ పాఠాలు వినే అవకాశం
- అందరూ ఉత్తీర్ణులవడమే లక్ష్యంగా కార్యాచరణ



ఖమ్మం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పాఠం బోధిస్తున్న అధ్యాపకురాలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుని ఇటీవల వార్షిక పరీక్షల్లో ఫెయిల్ విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లోనైనా ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ కార్యాచరణ రూపొందించాయి. ఈ మేరకు 24వ తేదీ నుంచి బోధిస్తున్న ప్రత్యేక తరగతులు బుధవారం ముగియనున్నాయి. నేరుగా తరగతులకు హాజరుకాలేదని గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆన్‌లైన్‌లోనూ పాఠాలు వినే అవకాశం కల్పించారు.

మొదటి సంవత్సరంలోనే ఎక్కువ మంది..

జిల్లాలోని 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 5,498మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అయితే, వీరిలో 2,914 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులు కాగా 2,584మంది ఫెయిలయ్యారు. ప్రథమ సంవత్సరంలో 2,801మందికి 1,245మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 2,697మందికి 1,669మంది పాసయ్యారు. జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా కూడా ప్రథమ సంవత్సరంలో తక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత కావటంతో వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తరగతులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముఖ్యమైన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు రాబట్టడం, గణితం, కెమిస్ట్రీ, ఫిజిక్స్ తదితర సబ్జెక్ట్‌ల్లో పాఠాలు బోధిస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతులు బుధవారం ముగియనుండగా, గురువారం నుంచి కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నాటి నుంచి సైతం యథావిధిగానే బోధన ఉంటుందని అధ్యాపకులు చెబుతున్నారు.

12 నుంచి పరీక్షలు

ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు ఉదయం 9–30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో విద్యార్థులు కూడా అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో పాస్ కావాలనే లక్ష్యంతో ఆసక్తిగా తరగతులకు హాజరవుతున్నారు. కాగా, జూన్ 12 నుంచి 20 వరకు పరీక్షలు జరగనున్నాయి.

అందరూ ఉత్తీర్ణత సాధించేలా..



ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈక్రమంలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారికి అధ్యాపకులు పాఠాలు బోధిస్తున్నారు. తరగతులకు హాజరుకాలేని వారికి ఆన్‌లైన్‌లోనూ పాఠాలు వినే అవకాశం కల్పించాం. తద్వారా అడ్వాన్స్ సప్లిమెంటరీ అందరూ ఉత్తీర్ణత సాధిస్తారనే నమ్మకం ఉంది.

– రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: 'సుడా' నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. నగరంలోని 27వ డివిజన్ శ్రీనివాసనగర్ అయ్యప్పస్వామి దేవాలయం వద్ద రూ.20 లక్షలతో, 17వ డివిజన్ శ్రీనివాసనగర్ చింటల్ గ్రౌండ్ వద్ద రూ.20 లక్షలతో, 28వ డివిజన్ హిమాలయ స్కూల్ వద్ద రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించి మాట్లాడారు.

46వ డివిజన్‌లో వైద్యశిబిరం

మమత ఆస్పత్రి, పువ్వాడ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన ఖమ్మం 46వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడిన ఆయన మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్లు ధనాల రాధ, గజ్జెల లక్ష్మి వెంకన్న, కమర్తపు మురళి, కన్నం వైష్ణవి, ప్రసన్నకృష్ణ, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, డీఈ నవ్యజ్యోతి, ఏఈ సతీష్, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, ధనాల శ్రీకాంత్, పాలడుగు పాపారావు, బత్తుల మురళి, తొగరు భాస్కర్, బొల్లేపల్లి విజయ్, బాల్తె నాగేశ్వరరావు, కనకం భద్రయ్య, కాటం యాదయ్య, కాటం కొమురయ్య, కన్నం రమేష్, శనిగరం ఉప్పలయ్య, గొరిగె నాగులు, గోధుమల శ్రీనివాసరావు, కాల్వొడ్డు శ్రీను, మంగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటా..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఉద్యమకారులకు ప్రాధాన్యం కల్పించాలని, మలిదశ ఉద్యమంలో పాల్గొని కేసులపాలై ఆర్థికంగా నష్టపోయిన వారిని ఆదుకోవాలని ఉద్యమకారులు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు వారు వినతిపత్రం అందజేయగా మంత్రి స్పందిస్తూ ఉద్యమకారులకు అండగా నిలుస్తానని, ప్రభుత్వ పథకాల్లో సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మెర రామ్మూర్తి, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, మందడపు శంకర్‌రావు, కోడి రెక్క ఉమాశంకర్, పాలకుర్తి కృష్ణ, ఎస్‌డీ.బురాన్ పాల్గొన్నారు.

విలువలు లేని పదవులు మాకెందుకు?



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం

నేలకొండపల్లి: ఉత్సవ విగ్రహాలుగా చూస్తూ, పాలకవర్గాలు చేసిన తీర్మానాలకు విలువ ఇవ్వనప్పుడు ఈ పదవులు తమకెందుకని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులపై మండిపడ్డారు. నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ రమ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేయగా రసాబాసగా సాగింది. పంచాయతీరాజ్ శాఖ నివేదికను ఏఈ ప్రసాద్ వెల్లడిస్తుండగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడ్డుకున్నారు. సీఎం ప్రకటించిన రూ.10 లక్షల నిధుల విషయంలో రాజకీయ జోక్యం సరికాదని, పాలకవర్గాలు చేసిన తీర్మానాలు ఎందుకు మార్చారో చెప్పాలని నిలదీశారు. తీర్మానాలకు విలువ లేనప్పుడు తామంతా రాజీనామా చేస్తామని సర్పంచ్‌లు వంగూరి వెంకటేశ్వర్లు, బచ్చలకూరి జ్యోతి, రాధాకృష్ణ, మస్తాన్, పుల్లమ్మ తదితరులు పేర్కొన్నారు. అలాగే, నేలకొండపల్లి ఎంపీటీసీ బొడ్డు బొందయ్య మాట్లాడుతూ నేలకొండపల్లి మేజర్ పంచాయతీకి సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.10 కోట్ల వ్యయంపై పాలకవర్గానికి తెలియకుండా పనులు ఎంపిక చేయటం సరికాదన్నారు. ప్రతీ సమావేశంలో సమస్యలు వెల్లడిస్తున్నా పరిష్కారం కావడంలేదని ఆచార్లగూడెం సర్పంచ్ శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. అనంతరం ఎంపీడీఓ కె.జమలారెడ్డి మాట్లాడుతూ లేఅవుట్ లేకుండా, డీటీసీపీ అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, తహసీల్దార్ దారా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించం..



మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. ఖమ్మం వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కమర్తపు మురళి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయంగా విమర్శించే సత్తా లేని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు పువ్వాడను అప్రతిష్ట పాలు చేయడమే లక్ష్యంగా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కొత్తగూడెంకు చెందిన యువకుడు పువ్వాడను అసభ్యకరమైన పదజాలంతో దూషించగా, ఆయన అభిమానులు దాడి చేస్తే అది పువ్వాడ వర్గం పనే నని చెప్పడం గర్హనీయమన్నారు. ఇక కోరం కనకయ్యకు జెడ్పీ చైర్మన్ పదవి బీఆర్‌ఎస్ ద్వారానే వచ్చిందని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజతో పాటు ఆశ్రఫ్, హెచ్.ప్రసాద్, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

నేలకొండపల్లి: కార్మిక చట్టాలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని సీఐటీయూ జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం సీటు ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని, సీఐటీయు పోరాట ఫలితంగా అనేక చట్టాలను కాపాడుకున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చెరుకు శ్రీనివాసరావు, తిరపతిరావు, వెంకటేష్, సైదులు, కనకరావు, బాబురావు, మధు పాల్గొన్నారు.

అవకతవకలు సరిచేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఓటరు నమోదులో జరిగిన అవకతవకలను సరిచేయాలని లేనిపక్షంలో ఎన్నికలు వాయిదా వేయాలని కోరుతూ నగర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు మంగళవారం నగర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఎన్నికల సంఘం అధ్యక్షుడు వి.సదానందచారికి వినతిపత్రం అందజేశారు. జూన్ 4న ఖమ్మంలో నిర్వహించే నగర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఎన్నికల్లో నగరంలో అనేక మంది విశ్వబ్రాహ్మణ కుటుంబాలు, సభ్యులు ఉన్నప్పటికీ వారికి ఓటు హక్కు కల్పించకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ కుమార్, యలగందుల నరేష్, కాపర్తి రామనాథం, తోగటి వెంకటాచారి, మండలోజు వీరాచారి, సైదాచారి, తాటికొండ శ్రీనివాసచారి, శ్రీరాములు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో 'బొమ్మ' విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మంఅర్బన్: జేఎన్‌టీయూ సోమవారం విడుదల చేసిన బీటెక్ మొదటి సంవత్సరం ఫలితాల్లో బొమ్మ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈమేరకు విద్యార్థులను కాలేజీ చైర్మన్ చైర్మన్ రాజేశ్వరరావు మంగళవారం అభినందించి మాట్లాడారు. ఈసీఈలో బి.మౌనిక 88శాతం మార్కులు సాధించి జిల్లా మొదటి స్థానంలో నిలవగా, వివిధ విభాగాల్లో బి.నవ్య 86.3శాతం, వి.ప్రసూన 85.7, కుషమ 82.3, మాధవి 81.8, కవిత 81.1, ఎం.రమ 80, ఈశ్వర్ 80, లిఖిత 81.6శాతం మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదారు శ్రీధర్, డైరెక్టర్ మాధవి తదితరులు అభినందించారు.

త్వరలోనే టీడీపీ అనుబంధ కమిటీలు



వీరేష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఖమ్మంఅర్బన్: జూన్ చివరి నాటికల్లా టీడీపీలో అన్ని అనుబంధ కమిటీలను నియమించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు కాసాని వీరేష్ వెల్లడించారు. మంగళవారం ఖమ్మం వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలో కూరపాటి వెంకటేశ్వర్లు, వడ్డె విజయ్‌తో కలిసి మాట్లాడారు. పార్టీ మండల, బూత్ కన్వీనర్లను నియమిస్తుండగా, త్వరలోనే పార్లమెంట్ కమిటీలను పూర్తి చేస్తామన్నారు. నాయకులు గుత్తా సీతయ్య, నాగండ్ల మురళి, కట్రం స్వామిదొర, ఎస్‌కే.బడేసాహెబ్, రామయ్య, సానబోయిన శ్రీనివాస్‌గౌడ్, మేకల సత్యవతి, రంగశెట్టి మంగమ్మ, లావణ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

రేపు జమ్మూ, కాశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం రాక



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: జమ్మూ, కాశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ నిర్మల్‌సింగ్ జూన్ 1న ఖమ్మం రానున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నిర్మల్‌సింగ్ జిల్లాలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారని చెప్పారు. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్ విజయవంతానికి కృషి చేసిన ఉమ్మడి జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, బీజేపీ జిల్లాలో బలహీనంగా ఉందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇదే నిజమైతే నిరుద్యోగ మార్చ్‌కు వేలాది మందికి ఎలా వచ్చారో చెప్పాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని పేర్కొన్నారు. నాయకులు గెంటెల విద్యాసాగర్, నున్నా రవికుమార్, మంద సరస్వతి, అల్లిక అంజయ్య, రవిరాథోడ్, అనంతు ఉపేందర్‌గౌడ్, దీకొండ శ్యాం, దార్ల శంకర్‌గౌడ్, ఆచంటి కోటేశ్వరరావు, ఫణికుమారి, నాగమణి, సుగుణ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణకరువు



మాట్లాడుతున్న అరుణ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దొడ్డా అరుణ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అర్హులైన వారికి డబుల్‌బెడ్‌రూం ఇవ్వడంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ సందర్భంగా 6వడివిజన్‌లో పలువురు మహిళలు పార్టీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు దొంగల సత్యనారాయణ, గెంటెల విద్యాసాగర్, డాక్టర్ విజయలక్ష్మి , పద్మ, సరస్వతి, శ్రీదేవి, అనిత, జ్యోతి, ఫణికుమారి, సుగుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు మాజీ సర్పంచ్ రామావత్ కైక భర్త, కాంగ్రెస్ నాయకుడు రామావత్ కస్నా అనారోగ్యంతో బాధపడుతుండగా పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ పాప్యానాయక్, నాయకులు వాసు, మోహన్, నాగరాజు, కిషన్, వీరన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: నకిలీ విత్తనాలను అరికట్టాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకెఎస్) జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణ ప్రణాళికను ముందస్తుగానే అమలు జరిపి సన్న, చిన్న కారు రైతులందరికీ రుణాలు ఇవ్వాలన్నారు. అందులో భాగంగానే భారత వ్యవసాయ రంగ పరిరక్షణకు తగిన ప్రాధాన్యతను ఇచ్చే విధంగా చట్టాలు తీసుకురావడం లేదన్నారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు మరీదు నాగేశ్వరరావు, నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మారుతి మల్లయ్య, పాశం అప్పారావు, నాగిరెడ్డి, కట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

రఘునాథపాలెం: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే కాంగ్రెస్ కార్యాచరణ ఉండబోతుందని పీసీసీ సభ్యులు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో పంగిడి, పుటానితండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీపీసీసీ ఆధ్వర్యంలో జూన్ 2న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల వారు జూన్ 1 వరకు 7661899899 నెంబర్‌కి మిస్డ్ కాల్ ఇచ్చి తమ పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమం దేవేందర్, భూక్యా బాలాజీ, కరుణాకర్ రెడ్డి, కొంటెముక్కల నాగేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలి

నేలకొండపల్లి: నివాస స్థలం లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దారా ప్రసాద్ సూచించారు. స్థానిక తహసీల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండలంలోని అప్పల నరసింహాపురం, నాచేపల్లి, మోటాపురం, రామచంద్రాపురం, శంకరగిరితండా, సదాశివాపురం గ్రామాల్లో ఇంటి స్థలం లేని వారు ఆయా పంచాయతీ కార్యాలయంలో బుధ, గురువారాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.


తిరుమలాయపాలెం: పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయనుండగా మంగళవారం తిరుమలాయపాలెంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని తిరుమలాయపాలెంలో 6 ఎకరాలు, కొక్కిరేణి 30 కుంటలు, ఇస్లావత్‌తండా 20 కుంటలు, హస్నాబాద్‌లో రెండు ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించారు. ఆయా గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలు స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

'ప్రజాగర్జన'ను జయప్రదం చేయండి

ఖమ్మంఅర్బన్: కొత్తగూడెంలో జూన్ 4న జరిగే సీపీఐ ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు పగడాల మల్లేష్ కోరారు. ఖమ్మంలో 14, 15వ డివిజన్ల కార్యకర్తల సమావేశం మంగళవారం జరగగా ఆయన మాట్లాడారు. నాయకులు రావులు హన్మంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బుడిగె ఉపేందర్, చింతకాయల లక్ష్మీరాయణ, వాకదాని వలరాజు, ముద్రబోయిన శ్రీనివాసరావు, అమరారపు ఉపేందర్, అప్పలస్వామి, పగడాల శ్రీనివాసరావు, లక్క వీరయ్య పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాగర్జన సభకు నియోజక వర్గం నుంచి పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తరలిరావాలని నియోజక వర్గ కార్యదర్శి ఎస్‌కె.జానిమియా కోరారు. నియోజకవర్గ పార్టీ, ప్రజా సంఘాల బాధ్యుల సమావేశం మంగళవారం ముస్తాఫానగర్‌లో మేకల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించగా ప్రజా సంఘాల బాధ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, పగడాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల ప్రాథమిక పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకుని గత స్మృతులను గుర్తు తెచ్చుకొని ఆనందం వ్యక్తం చేశారు. తమకు విద్య నేర్పిన గురువుల జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఆటపాటలతో సందడిగా గడిపారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ..



ఖమ్మం గాంధీచౌక్: బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో పూజలు



కూసుమంచి: అన్నదానం ప్రారంభిస్తున్న దృశ్యం



నేలకొండపల్లి: పసుపు, కుంకుమ కావళ్లతో భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డులో ఉన్న శ్రీసత్యనారాయణ సహిత వీరాంజనేయస్వామి దేవాలయంలో వార్షిక పవిత్రోత్సవ సహిత బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీసీతారాముల కల్యాణం, శ్రీరమా సత్యనారాయణ స్వామి తిరుకల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

శ్రీ షిర్డీ సాయిబాబా ప్రత్యేక పూజలు

నగరంలోని విజయనగర్ కాలనీ బైపాస్ రోడ్డు ఖానాపురం హవేలి శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. కార్పొరేటర్ పైడపల్లి రోహిణి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మచ్చ నరేందర్, ఇంటూరి తులసమ్మ, ఆలయ చైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య, జనరల్ సెక్రటరీ పెంట్యాల వెంకటనర్సయ్య, వైస్ చైర్మన్ బుద్ధా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ చంద్ర వీరభద్రరావు, ట్రెజరర్ కవులూరి అప్పారావు, సభ్యులు మండెపూడి కృష్ణయ్య, దొడ్డా నరసింహారావు, భిక్షపతి పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ కావడి, బుట్టల కావడి కార్యక్రమం కనుల పండువగా చేశారు.

కూసుమంచి: మండలంలోని హట్యాతండా గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు ఈవేడుకలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా కమిటీ సభ్యులు నాగేశ్వరరావును సత్కరించారు.